క్లుప్తంగా

సీఆర్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బయ్యారం: మండలంలోని జగ్గుతండా కస్తూర్బా బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్టీ) పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ దేవేంద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో డిగ్రీ, బీఈడీ చేసిన జిల్లాకు చెందిన మహిళా అభ్యర్థులు ఈనెల 21వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారు కేజీబీవీ నిబంధనల ప్రకారం పనిచేయాల్సి ఉంటుందన్నారు.

దంతాలపల్లి కస్తూర్బాలో..

దంతాలపల్లి: మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఫిజిక్స్ సబెక్టు పోస్టు ఖాళీగా ఉందన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఆసక్తి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఈనె 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పాఠశాల అధికారి స్వర్ణలతకు అందజేయాలన్నారు.

డాక్టరేట్ ప్రదానం

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి సునీల్ కుమార్‌కు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పట్టా వరించింది. 'రిలేషన్షిప్ బిట్వీన్ బాడీ టైప్స్ అండ్ ఫిజికల్ ఫిట్నెస్ వేరియబుల్స్ అమాంగ్ ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్ ఇన్వెస్ట్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తతండాకు చెందిన జాటోతు నరేందర్ ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు.

కళాశాల భవనం నిర్మించాలి

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల శిథిలావస్థలో చేరుకుని కురుస్తుందని, వెంటనే నూతన భవనం నిర్మించాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోతు సాయికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయం ఎదుట డీఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు భూక్య శ్రీకాంత్, చరణ్, ప్రవీణ్, రాకేష్, వినయ్, చంటి, భరత్, మహేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ చేసిన కేంద్ర బృందం



గంగారం: బోద వ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దాలని కేంద్ర వైద్య బృందం డాక్టర్ నిర్మల్‌జో, డాక్టర్ పర్వీన్ అన్నారు. మండలాన్ని మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎండీఏ)బోధ వ్యాధి నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ నుంచి కేంద్ర వైద్య బృందం మంగళవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతోపాటు అన్ని పల్లెదవాఖానాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, పీఓ డాక్టర్ సుధీర్, హెచ్ఈ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మరిపెడ రూరల్: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 500 గ్రాములు గంజాయిని సమాచారం మేరకు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని భూక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సెకండ్ ఎస్సై కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని భూక్యతండాకు చెందిన భూక్య బిక్య తన ఇంట్లో 500గ్రాముల గంజాయిని అక్రమంగా నిల్వ ఉంచాడు. సమాచారం మేరకు ఎస్సై ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకుని భూక్య బిక్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి కేసులో పట్టుబడిన వ్యక్తే ఇటీవల పేలుడు పదార్థాల కేసులో కూడా ఎన్ఐఏ అధికారులు విచారించినట్లు తెలిసింది.

ఆర్‌యూబీ నిర్మాణానికి స్థల పరిశీలన

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో చేపట్టనున్న ఆర్‌యూబీ నిర్మాణం కోసం, రైల్వే, ఆర్అండ్‌బీ, మున్సిపాలిటీ అధికారులు మంగళవారం మ్యాప్, స్థలాన్ని పరిశీలించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద గతంలో ఉన్న పాత గేటు స్థానంలోనే ఆర్‌యూబీని నిర్మించనున్నట్లు తెలిపారు. కాగా అండర్‌బ్రిడ్జి నిర్మాణాన్ని బట్టి రైల్వేట్రాక్‌కు ఇరువైపుల అంబేడ్కర్, అమరవీరుల స్థూపం సెంటర్ వరకు సుమారు 5మీటర్ల వరకు సైడ్‌వాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే అండర్‌బ్రిడ్జి పనులను ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఏఈ ప్రశాంత్, సూపర్‌వైజర్ నిశాంత్, మున్సిపల్ అధికారి ప్రభాకర్, వోలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరదొస్తే ముప్పే..!

- మూసుకుపోయిన కొర్లకుంట కాల్వ
- పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లు
- ఆక్రమణకు గురైన కుంట
- రైల్వేట్రాక్‌కు పొంచి ఉన్న ప్రమాదం



కొర్లకుంట చెరువు



రైల్వేట్రాక్ సమీపానికి చేరిన కొర్లకుంట వరదనీరు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని కొర్లకుంట నుంచి పెద్ద చెరువు వరకు విస్తరించి ఉన్న కొర్లకుంట కాల్వ పిచ్చి మొక్కలు, చెట్లతో పూడుకుపోయింది. ప్రస్తుతం భారీ వర్షాలు పడుతుండడంతో కొర్లకుంటకు వరద నీరు వస్తోంది. ఈ కుంటలో కొంత భూమిని ఆక్రమించి వెంచర్‌ను ఏర్పాటు చేసేందుకు మట్టి పోసి పూడ్చడంతో కుంటలోకి చేరాల్సిన వరద పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ సమీపం నుంచి ప్రవహిస్తోంది. కొర్లకుంట కింద జయపురం శివారులో సర్వే నంబర్ 19లో సుమారు 20ఎకరాల మేర విస్తరించి, అనేక భూములు సాగయ్యేవి. కుంట ఆక్రమణకు గురి కావడంతో ప్రస్తుతం 8ఎకరాల మేర ఉన్న కుంట భూముల్లో ఇటీవల కొంత భాగాన్ని విస్తరించి కట్టను తొలగించి మట్టితో చదును చేశారు. గార్ల మండల పరిధిలోని వడ్లకుంట, శర్మకుంటతోపాటు వ్యవసాయ భూముల్లోని వరద కొర్లకుంటకు చేరుకుంటుంది. 2017లో మిషన్ భగీరథ పథకం ద్వారా కుంట అభివృదికి నిధులు కేటాయించగా కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నాడు.

2.5కిలోమీటర్ల కాల్వ..

జయపురం శివారులోని కొర్లకుంట నుంచి జయపురం, రైల్వే కాలనీలు, నెహ్రూస్ట్రీట్ మీదుగా 2.5కిలోమీటర్లు విస్తరించిన కాల్వ ద్వారా పెద్ద చెరువుకు వరద చేరుకుంటుంది. ప్రస్తుతం ఈ కాల్వ చెట్లు, పిచ్చి మొక్కలతో పూడుకుపోయింది. కొర్లకుంట ఆక్రమణ, కాల్వ మూసుకుపోవడంతో వరద పోటెత్తితే రైల్వే కాలనీలు, జయపురం, నెహ్రూస్ట్రీట్ తోపాటు రైల్వేట్రాక్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. 2006లో కొర్లకుంటకు వరద పోటెత్తడం, కాల్వ సక్రమంగా లేకపోవడంతో రైల్వే కాలనీలు, నెహ్రూస్ట్రీట్, జయపురంలోని ఇళ్లు ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లింది. డోర్నకల్ మున్సిపాలిటీ సిబ్బంది గతంలో కొర్లకుంట కాల్వ అభివృద్ధి పనుల కోసం రూ.50లక్షలతో అంచనాలు సిద్ధం చేసినా నిధుల కొరతతో పనులు ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి కొర్లకుంట ఆక్రమణలను అరికట్టి కాలువను శుభ్రం చేసే పనులు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

కొర్లకుంటను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురైంది. కాల్వలు చెట్లు, పిచ్చి మొక్కలతో పూడుకుపోయి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే ఆక్రమణలు అరికట్టి, కాల్వలకు మరమ్మతు పనులు చేపట్టాలి.
- గాజుల వేణుగోపాల్, నెహ్రూస్ట్రీట్



పిచ్చిమొక్కలతో నిండిన కాల్వ

యూరియా కొరతపై ఆందోళన



నెల్లికుదురు: ధర్నా చేస్తున్న నాయకులు

నెల్లికుదురు: రైతులకు యూరియా బస్తాలు అందించే వరకు ఉద్యమం ఆగదని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి

బయ్యారం: రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచాలని మాస్‌లైన్ జిల్లా నాయకులు జగ్గన్న ప్రభుత్వంను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొక్కజొన్న, వరి రైతులకు ప్రస్తుతం యూరియా అవసరం ఉండటంతో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



కేసముద్రం: మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కేసముద్రం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి అమీనాపురం గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నరకం ధాన్యానికి బోనస్ రూ.500లు, రైతుభరోసా, రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ప్రస్తుతం యూరియా కొరత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీలు విమర్శించడం సరికాదన్నారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కోటాను అందించలేదని ఆయన విమర్శించాడు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భద్రునాయక్, మండల ఉపాధ్యక్షుడు కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, సామ సుధాకర్‌రెడ్డి, యార సాగర్, లకావత్ బాలు, కాసు సతీష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

డోర్నకల్: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని ఫకీరాతండాలో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్, నాయకులు రాయల వెంకటేశ్వర్లు, ఆంగోత్ వెంకన్న, పగిడిపాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి



పెద్దవంగర: సభ్యత్వం అందజేస్తున్న సతీష్ రెడ్డి

పెద్దవంగర: సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1వ తేదీన చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సతీష్ రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో పీఆర్టీయూ (టీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్ 1వ తేదీన పింఛన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాదర్నాకు పీఆర్టీయూ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు యాకుబ్ పాషా, శ్రీధర్, బాలరాజు, వేణుమాధవ్, విద్యాసాగర్, సింహాద్రి పాల్గొన్నారు.

మరిపెడ: సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనంతరావు, అర్జున్, మహేష్, లింగయ్య, సునిల్ కుమార్, దత్తప్రసాద్, కరుణాకర్, సరోజ, వెంకన్న, లెనిన్, రవి పాల్గొన్నారు.

చెదిరిపోని మధుర జ్ఞాపకమే ఫొటో



మహబూబాబాద్ అర్బన్: వేడుకలు నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు



మరిపెడ: వేడుకల్లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు



తొర్రూరు: సన్మానం పొందిన ఫొటోగ్రాఫర్లు

అంతర్జాతీయ ఫొటోగ్రఫీ వేడుకలు ఫొటోగ్రాఫర్లు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు డాగ్యూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. మరుపు రాణి మధుర జ్ఞాపకాలను కలకాలం కళ్ల ముందు ఉంచేదే ఫొటో అని అన్నారు. పెరిగిన టెక్నాలజీతో దెబ్బతిన్న ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం నాయకులు కోరారు.
- సాక్షి నెట్‌వర్క్

యూరియాను బ్లాక్ చేస్తే కఠిన చర్యలు



కొత్తగూడ: పీఏసీఎస్‌లో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కొత్తగూడ: యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి సురేష్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పొగుళ్లపల్లి పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఏఓ ఉదయ్, ఏఈఓలు పాల్గొన్నారు.

యూరియాను నిల్వ పెట్టుకోవద్దు..

కురవి: రైతులు అవసరానికి మించి యూరియాను నిల్వ పెట్టుకోవద్దని మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో యూరియా కొరతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరిపెడ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 6400 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు తెలిపారు. 170 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నరసింహరావు, ఏఈఓలు రాజేశ్వరీ, దేవ పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

దంతాలపల్లి: యూరియా కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు సునీల్‌కుమార్, ఏఓ వాహిని, మండల ప్రత్యేకాధికారి వీరన్న అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల షాపులను తనిఖీ చేశారు. అధికారులు దీక్షిత్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలకు షోకాజ్ నోటీసులు

డోర్నకల్: మండలంలోని నాలుగు ఎరువుల దుకాణాలకు మంగళవారం వ్యవసాయ శాఖ నోటీసులు జారీ చేసింది. మరిపెడ ఏడీఏ విజయచందర్ పలుదుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని నాలుగు దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డోర్నకల్‌లోని బాలాజీ ఫెర్టిలైజర్స్, వీరవెంకట సత్యనారాయణ ఫెర్టిలైజర్స్, చిలుకోడులోని మణికంట ఫెర్టిలైజర్స్, జోగ్యాతండాలో బాలాజీ ట్రేడర్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ-పాస్ మిషన్లలో ఎరువుల విక్రయాలను సక్రమంగా నమోదు చేయకపోవడం, ఎరువుల స్టాకులో వ్యత్యాసాలు, రికార్డుల్లో వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంతో నోటీసులు జారీ చేశారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

పెద్దవంగర: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి స్వామి నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు బజార్, పోచంపల్లి, అవుతాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహసీల్దార్, ఎస్సై క్రాంతి కిరణ్‌తో కలిసి తనిఖీ చేశారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి

బయ్యారం: నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ శ్రీనివాసరావు ఎరువుల డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డీలర్లతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, సీఐ రవికుమార్ పాల్గొన్నారు.

హత్యాయత్నం.. కేసు నమోదు

తొర్రూరు రూరల్: ప్రేమ వివాహం చేసుకున్న పెళ్లి కుమారుడు, అతని తల్లిదండ్రులపై దాడి చేసిన ఘటనలో అమ్మాయి బంధువులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన కొమ్ము అజయ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన యేషబోయిన లావణ్యను గత నెలరోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో పెళ్లి కుమారుడు అజయ్ తన భార్య లావణ్యను తీసుకుని తమ ఇంటికి వచ్చారు. సమాచారం తెలుసుకున్న లావణ్య తల్లిదండ్రులు యేషబోయిన రాములు, యాకమ్మ, కొడుకు సాయికుమార్, బంధువులు సోమయ్య, శ్రీను, సాయిలు, కోమలత, వెంకటమ్మ, యాకమ్మ తోపాటు మరికొంత మంది పెళ్లి కుమారుడు అజయ్ ఇంటికి వచ్చి వారితో గొడవ చేస్తూ కర్రలతో అజయ్, తల్లిదండ్రులపై దాడి చేయగా, పలువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, కొంతమందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, మిగిలిన వారిని సైతం త్వరలో అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు.

రైతు సమస్యలపై నిరంతర పోరాటం



గంగారం: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

గంగారం: రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడుతున్న అఖిల భారత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండలంలోని పందెం గ్రామంలో మంగళవారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జోగ రామయ్య, పూనమ్, రవికుమార్, గొంది శ్రీను, చీమల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నెల్లికుదురు: రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఈనెల 25, 26న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి జక్కుల యాకయ్య పిలుపు నిచ్చారు. మండలంలోని మేచరాజుపల్లి గ్రామ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు, రవీందర్, ఐలయ్య, సాయిలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులను ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన మొక్కజొన్న, పెసర, పత్తి, ఇతర పంటలు దెబ్బతింటున్నాయని, రైతును ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రవి మంగళవారం తెలిపారు.

నకిలీ వ్యాపారులపై చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: జీవనోపాధి కోసం వలసలు వచ్చి కొంత మంది ఇతర ప్రాంతాల నుంచి నకిలీ వస్తువులను విక్రయిస్తూ నకిలీ వ్యాపారం చేస్తున్న వ్యాపారులపై చర్య తీసుకోవాలని సేవాలాల్ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బానోత్ భాస్కర్ నాయక్ మంగళవారం కోరారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో బాధితుడు నక్క యాకయ్యకు చెందిన రెండు గొర్రెలు మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.30వేల విలువ చేసే రెండు గొర్రెలు మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరాడు.

చెస్ బోర్డుల అందజేత

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గుజ్జ శ్రీనివాసరావు, మంజుల దంపతుల ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్స్ హెచ్ఎంలకు మంగళవారం చెస్ బోర్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కాలేరు యాదగిరి, ధన్నసరి పీఏసీఎస్ చైర్మన్ మర్రి రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు నీలం దుర్గేష్, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, హెచ్ఎంలు బండారు నరేందర్, రాజు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

తొర్రూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ పీడీ హనుమా నాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కార్యాలయ పరిధిలోని నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపీడీఓ కె.వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ పూర్ణచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు అభినందనలు



కురవి: మండలంలోని నేరడ మోడల్ స్కూల్‌కు చెందిన బాలికలు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనడంతో వారిని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీకాంత్ మంగళవారం అభినందించారు. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీల్లో రక్షిత, ధరావత్ మమత, జ్యోత్స్న, కావ్య, మమత పాల్గొన్నట్లు ఆయన వివరించారు. వీరికి ప్రశంసపత్రాలను అందించారు. కార్యక్రమంలో పీడీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

తొర్రూరు: వినాయక ప్రతిమల విక్రయదారులు నిబంధనలు పాటించాలని విద్యుత్ శాఖ డీఈ బి.రవి తెలిపారు. పట్టణంలోని వినాయక ప్రతిమల విక్రయ కేంద్రాలను మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డీఈ మాట్లాడుతూ ఎక్కువ ఎత్తు ఉన్న వినాయక విగ్రహాలను ట్రాక్టర్‌లో ఎక్కించేటప్పుడు పైన ఉండే 11కేవీ విద్యుత్ లైన్లకు తాకకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు.

యూరియాను అధికంగా వాడొద్దు

పెద్దవంగర: రైతులు యూరియాను అధికంగా వాడకూడదని ఏఓ స్వామి నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటలకు అవసరమైన యూరియాను మూడు దఫాలుగా మాత్రమే వాడాలని ఆయన సలహా ఇచ్చారు. యూరియాను అధిక మొత్తంలో వాడితే గాలిలో ఆవిరై పోతుందన్నారు. ప్రత్యామ్నాయంగా రైతులు నానో యూరియాను వాడాలని కోరారు.

విద్యతోనే ఉన్నతస్థాయి

గూడూరు: చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యావంతుడు సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకుంటాడని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మండలంలోని సీతానగరం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు అందించిన పోటీ పరీక్షల పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పులి దేవేందర్ పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహాలు నిర్మించాలి

నర్సింహులపేట: మండల కేంద్రంలో గిరిజనుల బాలబాలికల వసతి గృహాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విద్యార్థి పోరు గర్జన జీపుయాత్ర రావడంతో పెద్ద ఎత్తున విద్యార్థులు ర్యాలీ తీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు గడుస్తున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు, నాయకులు వెంకన్న, అమీర్, రాకేష్, కల్యాణి పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్.. ఇద్దరు యువకుల అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: బాలికను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బాలిక ఈనెల 12వ తేదీ నుంచి కనిపించటం లేదని ఆమె తల్లి ఈనెల 14వ తేదీన టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పలువురు యువకులపై అనుమానం ఉందని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ పోలీసులు చేపట్టారు. కొద్ది రోజుల క్రితం నుంచి హనుమంతునిగడ్డకు చెందిన డోలి వినయ్ కుమార్ మాయమాటలు చెప్పి ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని అతడి స్నేహితుడైన, కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన షేక్.అబిద్ పాషా సహాయంతో సదరు బాలికను తీసుకెళ్లారు. హైదరాబాద్, ములుగు ప్రాంతాల్లో తిరిగి వరంగల్‌లో బాలికను వదిలేసి వెళ్లారు. బాలికను పోలీసులు పట్టుకుని, టౌన్ ఎస్సై టి.అశోక్ పోక్సో చట్టం కింద కేసు నమోదు ద్వారా డోలి వినయ్ కుమార్, షేక్ అబిద్ పాషాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

గార్ల: గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన గొల్లెం సత్యం(75) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి అందరూ ఆడపిల్లలే సంతానం, కాగా పెద్దకూతురు విజయకుమారి తండ్రికి తలకొరివి పెట్టి కన్నతండ్రి రుణం తీర్చుకుంది.

సభను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఆదివాసీ హక్కుల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన హన్మకొండలో జరగనున్న రాష్ట్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ పిలుపునిచ్చారు. సభ పోస్టర్లను మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న, డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, దుడ్డెల రాంమూర్తి, కొత్తపల్లి, మైస శ్రీనివాస్, గుగులోత్ హరినాయక్, సామ పాపయ్య, వాంకుడోత్ ఉపేందర్ పాల్గొన్నారు.

కూలీలుగా మారిన విద్యార్థులు..!



కాల్వ శుభ్రం చేస్తున్న విద్యార్థులు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో కొందరు విద్యార్థులు మంగళవారం ఉపాధ్యాయుల ప్రోద్బలంతో పారలతో కాల్వలను శుభ్రం చేయడంపై పలువురు తల్లిదండ్రులు అసహాయనం వ్యక్తం చేశారు. 9,10 తరగతులకు చెందిన విద్యార్థులు స్కూల్‌లో ఉన్న మురుగు నీరు వెళ్లడానికి కూలీలుగా మారి పారలతో శుభ్రం చేశారు. పని మనుషులను పెట్టి శుభ్రం చేయాల్సిన కాల్వలను విద్యార్థులతో శుభ్రం చేయించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ విషయంపై ఉపాధ్యాయులను వివరణ కోరగా.. పొంతన లేని సమాధానాలు చెప్పడం విశేషం.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646